క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలో అన్ని సబ్ స్టేషన్‌లలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. 33/11 కేవీ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కొండూరు, పెనగలూరు, బెస్తపల్లి, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణం తీరనిలోటు

రాయచోటి అర్బన్ : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి దుర్మరణం పట్ల అన్నమయ్య జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆకివీడులో జరిగిన అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపి తిరిగి భీమవరంలో జరిగే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జి మరణించడం బాధాకరమన్నారు. ఆయన మరణం ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని నష్టం అన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట డిపో కార్యాలయంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజరు గుండాల రమణయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు రవాణా పరమైన సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేయాలన్నారు. ప్రయాణీకుల సూచనలు, సలహాలను ఉన్నతాధికారులకు చేరుస్తామన్నారు. సమ్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లెలో వెలసిన శ్రీ షిర్డి సాయినాథుని మందిర ఆరవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా డాక్టర్ పాలగిరి శ్రీనివాస రాజు ఎంపికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కమిటీ నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను శుక్రవారం రిటైర్డ్ హైకోర్టు జడ్జీ ఎం.వెంకట రమణ కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, శంకరయ్య స్వామి, చంద్రశేఖర్ స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి వారి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు రాహుకాల పూజ విశేషాలను వివరించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

ఓబులవారిపల్లె : ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా సుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. శుక్రవారం ముక్కవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గడ్డం ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా రామముని రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సోమేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

భూ పంపిణీ చేయాలి

చిన్నమండెం : భూమి లేని అర్హులకు 2 ఎకరాల చొప్పున రెండో విడతలో భూ పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని చాకిబండ గొట్టివీడు గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వందల సంఖ్యలో ఎన్నో సంవత్సరాలుగా అనుభవంలో ఉన్న భూములకు పట్టాల కోసం ఎదురు చూస్తున్నా రాలేదని స్థానిక రైతులు వాపోతున్నారన్నారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ నాయకులు రమణ, ఈశ్వర్‌రెడ్డి, వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు

లక్కిరెడ్డిపల్లె : నామాలగుట్టపై అయ్యప్ప మాలధారులకు కొన్ని రోజులుగా చేస్తున్న అన్నదానానికి రాయచోటికి చెందిన సత్య, సిద్దయ్య కుటుంబ సభ్యులు రూ. 60 వేలు, కుర్నూతల ఎంపీటీసీ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ. 20 వేలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ప్రజాసేవలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- సీఎం జగన్ పుట్టినరోజు కానుకగా వలంటీర్లకు దుస్తుల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


ఒంటిమిట్ట: దుస్తుల పంపిణీ అనంతరం వలంటీర్లతో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : ప్రజా సేవలో వలంటీర్ల పనితీరు చిరస్మరణీయమని రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల వలంటీర్లకు దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మేడా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సంక్షేమాభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలవడంలో వలంటీర్లకు కృషి ఎంతో ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మాత్రమే ప్రజలకు చేర్చడం కాకుండా, భీకర ప్రకృతి వైపరీత్యాల వల్ల బాధింపబడ్డ ప్రజలకు మేమున్నామంటూ సహాయక చర్యలు అందించడంలో వలంటీర్ల కృషి ఎనలేనిదన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో గానీ, సోకిన వారిని గుర్తించి క్వారంటైన్ చేయడం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంలో వారి పాత్ర అభినందనీయమన్నారు. వలంటీర్లు లేకుంటే అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే వారు లేరని, వలంటీర్ల వ్యవస్థ అనేది అవినీతి రహిత వ్యవస్థ అని ప్రజలే అంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసుల రెడ్డి, దున్నూతల రఘురాంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నందలూరులో..

నందలూరు(రాజంపేట) : ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా సేవలు అందిస్తున్న వలంటీర్లకు శనివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సేవా సత్కార కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని అగ్రికల్చర్ సభా భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

సీఎం జగన్ పాలనలోనే అర్హులందరికీ సంక్షేమం


పథకాల కరపత్రాలను ప్రదర్శిస్తున్న చైర్మన్ తదితరులు

రాయచోటి అర్బన్ : సీఎం జగనన్న పాలనలోనే రాష్ట్రంలో అర్హులైన పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని బండ్లపెంట అర్బన్ పీహెచ్‌సీ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి పేదలకు బాసటగా నిలుస్తున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేర్చారని చెప్పారు. నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలను మార్చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలియజేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతుభరోసా, డ్వాక్రా రుణాలు, వసతి, విద్యా దీవెనలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, కౌన్సిలర్ ఆసిఫ్ అలీఖాన్, నేతలు రియాజుర్, ఖదీర్, రియాజ్, బేపారి జబీవుల్లా, అంజద్‌ఖాన్, మున్సిపల్ ఏఈ క్రిష్ణారెడ్డి, ఆర్‌ఐ మల్లికార్జునతోపాటు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పత్రపల్లెలో 'పోలీస్ డేగ'

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీలోని పత్రపల్లెలో శుక్రవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కమిటీ ఇంచార్జ్ నరసరామ్ ఆధ్వర్యంలో 'పోలీస్ డేగ కళా జాత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటక రూపంలో నేరాలు చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వస్తాయో ప్రజలకు తెలియపరిచారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర బృందానికి ఘనస్వాగతం


నిత్యానంద రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ

నందలూరు(రాజంపేట) : తిరుమలకు మహా పాదయాత్రగా కడప నుంచి వెళ్తున్న కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డిని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్ కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిత్యానందరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని మహాపాదయాత్రగా తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరస్వామిని వేడుకోనున్నట్లు వారు తెలిపారు.

రమణీయం.. శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం


ప్రత్యేక ఆసనంపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి 21వ తిరుమల మహాపాదయాత్ర సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఆకేపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా దేవ దేవేరిలను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైన టీటీడీకి చెందిన వేదపండితులు కొలువుదీర్చారు. ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు, ఆకేపాటి అనీల్ కుమార్ రెడ్డి, సుజనమ్మ దంపతులకు కంకణాలు కట్టిన వేదపండితులు కల్యాణాన్ని మొదలెట్టారు. టీటీడీ వేదపండితులు వేదమంత్రాలు వల్లిస్తూ కల్యాణం జరిపించారు. అనంతరం శాస్త్రోక్తంగా హోమం నిర్వహింపజేశారు. భక్తులకు, దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమం ఆకేపాటి సోదరులు నిర్వహించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు తదితరులు

సంబేపల్లె : స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారానికే మండలస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఉదయం సంబేపల్లె ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందన్నారు. గ్రామస్థాయిలో చిన్నచిన్న అంశాలు ఏమైనా జిల్లా అధికారుల దృష్టికి రానివి, జిల్లా కేంద్రానికి రాలేని వారి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అధికారులందరూ హాజరవుతారు కాబట్టి స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డిలు అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులకు ఎండార్స్ చేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

కార్యక్రమంలో అందిన కొన్ని విజ్ఞప్తులు..

సంబేపల్లె మండలం దేవపట్లకు చెందిన ఎం భారతీ తన భర్త రోడ్డు ప్రమాదంలో 2022 నవంబర్ 25న మరణించాడని అయినా ఇంతవరకు తనకు వైఎస్సార్ బీమా అందలేదని, న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. అలాగే మండల పరిధిలోని రైతుకుంట గ్రామం కుమ్మరపల్లి నుంచి చిన్నమండెం వరకు వెళ్లే దారి మధ్యలో బ్రిడ్జి వర్షాల కారణంగా కూలిపోయిందని, దానిని త్వరగా పునఃనిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన నరసింహ నాయుడు తన భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, పట్టాదారు పాసుపుస్తకం ఉన్నాయని, అయితే ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, ఆన్‌లైన్ చేయించవలసిందిగా అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో మొత్తం దాదాపు 35 దరఖాస్తులు అందాయన్నారు. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా కాల పరిమితిలోపు పరిష్కరించాలని తెలియజేశారు. నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, తహసీల్దార్ మహేశ్వరి, ఎంపీడీఓ నరసింహం, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ రామచంద్ర, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీ అనుబంధ విభాగ కమిటీల ఏర్పాటు

రాయచోటి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి నియోజకవర్గానికి చెందిన వారిని అన్నమయ్య జిల్లాకు సంబంధించి జిల్లా అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలలో నియమించినట్లు రాష్ట్ర పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా బీసీ సెల్ కమిటీలో వైస్ ప్రెసిడెంట్ యేపూరి వెంకట జగదీశ్వర్, సెక్రటరీలుగా బండి వెంకటసాయి పరశురాం, నాగూరి ఇమాములు, జాయింట్ సెక్రటరీలుగా వల్లపు రవీంద్ర, దొరగల్లు మోహన్‌కుమార్‌లను నియమించారు. అదే విధంగా జిల్లా కల్చరల్ వింగ్ కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా అయోధ్యపురం రాంప్రసాద్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా కె.వీరారెడ్డి, సెక్రటరీలుగా ఎల్.వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.వెంకటరామానందరెడ్డి, రెడ్డిపోగు రమణయ్య, గాలివీడు శివరామయ్యలను నియమించారు. అదే విధంగా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా ఏ.రఘునాథ్(డేవిడ్‌రాజు), జనరల్ సెక్రటరీ ఎస్.అంజలాబాబు, సెక్రటరీలుగా ఎన్.మనోజ్‌కుమార్, ఎం.దేవదాస్, జాయింట్ సెక్రటరీలుగా పి.యేసయ్య, పి.నిరంజన్‌లను ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీలో ప్రెసిడెంట్ జె.కిశోర్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎం.రాజశేఖర్‌రెడ్డి, సెక్రటరీలుగా సి.సురేష్, ఎం.ఓంసాయినాథ, సయ్యద్ జబీవుల్లాబాషా, సయ్యద్ ఫైజాన్, జాయింట్ సెక్రటరీలుగా వి.వెంకట్రామిరెడ్డి, ఆర్.మనోహర్ నాయుడు, వై.పుష్పరాజులను నియమించారు.

బీసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గుణయాదవ్

రాజంపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నందలూరు మండలం గొల్లపల్లెకు చెందిన పునగాని ఫాల్గుణ (గుణయాదవ్)ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన పలువురిని జిల్లా అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. ఇందులో జిల్లా బీసీ సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా కుమ్మరి ప్రసాద్, సెక్రటరీలుగా అవుల నారాయణ, టి.శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా తమ్మిశెట్టి సుబ్రమణ్యం, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ జనరల్ సెక్రటరీగా కె.మార్క్, సెక్రటరీలుగా జి.హరిబాబు, ఏ అహరోన్, జాయింట్ సెక్రటరీలుగా వై.నారాయణ, బి.యేసన్నలను నియమించారు. అలానే జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా టి.హరికృష్ణ, జనరల్ సెక్రటరీగా పి.మనోజ్ కుమార్‌లను నియమించారు.

రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా జి.రమేష్

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా రైల్వేకోడూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్‌కు శుక్రవారం నియామక పత్రం అందింది.

మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా కరీముల్లా

రాజంపేట : వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ కరీముల్లా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వుల జారీ చేశారు.

ఆశాల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : విధి నిర్వహణలో ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట గురువారం మొదలైన 36 గంటల ధర్నా శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లపై పనిభారం తగదన్నారు. వారి సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్యం వీడాలన్నారు. ఆశ వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలన్నారు. కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఆశ వర్కర్‌ల నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆశ వర్కర్‌ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, కోశాధికారి ముంతాజ్‌లు మాట్లాడుతూ ఆశలకు అందజేసిన ఫోన్‌లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. సదరు ఫోన్‌లతోనే విధి నిర్వహణ చేయాలని ఆశలపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. అనంతరం ఆశలు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, ఆశ వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామయ్య, నీలావతి, లావణ్య, నాగరత్నమ్మ, రమాదేవి, ఫమిదా, సుధారాణి, నాగేశ్వరి, సునందతోపాటు పెద్దఎత్తున ఆశలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతలు చేరాలి


రామాపురం:గ్రామాలకు తరలిస్తున్న రాముడి అక్షింతలు

రామాపురం : అయోధ్య రామాలయం నుండి వచ్చిన అక్షింతలు, శ్రీ రాముని పటం, కరపత్రాలను ప్రతి ఇంటికి చేర్చాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, వీహెచ్‌పీ అధ్యక్షులు అంజనేయరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిహర ఆలయం నుంచి పురవీధుల గుండా శ్రీరామ తీర్థ క్షేత్రం ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు సామగ్రిని చేర్చారు. జనవరి 1 నుంచి 12 వరకు గ్రామాలలో పంపిణీ చేస్తామని చెప్పారు.

నందలూరుకు చేరిన అయోధ్య అక్షింతలు

నందలూరు(రాజంపేట) : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు శుక్రవారం నందలూరుకు చేరుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎంబలూరు నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అక్షింతలను అరవపల్లిలోని శ్రీకృష్ణ గీతా మందిరం నుంచి వాటిని మండలంలోని అన్ని పంచాయతీలకు పంపి ప్రజలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చుక్కా యానాది, మోడపోతుల రాము, తాటి సుబ్బరాయుడు, కుర్రమణి యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని 65 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహించే వర్కర్లు, ఆయాలు తమ డిమాండ్ల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత నాలుగు రోజులుగా విధులను బహిష్కరించి ధర్నాలు చేపడుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం మండలంలోని 65 అంగన్‌వాడీ కేంద్రాలలో 28 అంగన్‌వాడీ కేంద్రాలను లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాతమ్మ, హుసేనమ్మలతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసిన తాళాలు పగలగొట్టి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులుగా సచివాలయం సిబ్బంది, డ్వాక్రా సభ్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసి రోజు వారీగా అంగన్‌వాడీ కేంద్రలు యథావిధిగా పని చేస్తాయని తెలిపారు.

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రం భవనానికి చెందిన బీగాలను తొలగించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని పౌష్టికాహారాన్ని పిల్లలకు యథావిధిగా శనివారం నుంచి అందజేస్తామన్నారు. ప్రభుత్వం గైడ్‌లైన్స్ ప్రకారం అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న పౌష్టికాహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గర్భిణులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించే విధంగా అన్నీ చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, మహిళా పోలీసు మౌనిక, వీఓఏ సులోచన, వలంటీర్లు పి.మానస, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం


వలంటీర్లకు మెమెంటోలు అందిస్తున్న దృశ్యం

చిట్వేలి : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు అందరూ కృషి చేయాలి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మునిస్వామి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన 67వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేపథ్యంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు ఎవరికి వారు వారికిచ్చిన బాధ్యతలను చక్కగా నిర్వర్తించినందుకు సీహెచ్‌ఎస్ వారు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, ఏబీఎన్ ప్రసాద్, దుర్గరాజు, విశ్వనాథం, శ్రీనివాసులు, సీహెచ్‌ఎస్ కార్యవర్గ సభ్యులు ఇంతియాజ్ అహ్మద్, శివనాగేశ్వరరావు, నరసింహులు నాయుడు, పెంచలయ్య, తిరుమలరెడ్డి, వరుణ్ కుమార్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి పాదయాత్రకు మేడా సంఘీబావం


ఆకేపాటి, మేడాలను సత్కరిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి చేపట్టిన 21వ తిరుమల మహా పాదయాత్రకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు సంఘీబావం తెలిపారు. మండల పరిధిలోని ఆకేపాడులో నూతనంగా నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపంలో పాదయాత్ర ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటిని ఎమ్మెల్యే మేడా, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటిని, ఎమ్మెల్యే మేడాను గజమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆకేపాటికి సత్కారం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని శుక్రవారం రాజంపేట బైపాస్‌లో గజమాలతో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆకేపాటి అమరనాథరెడ్డి 21వ తిరుమల మహాపాదయాత్రకు వెళ్తుండగా బైపాస్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన్ను కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్దవరం శ్రీనివాసుల రెడ్డితో పాటు వైఎస్సార్ సిపి నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగాలు చిరస్మరణీయం


రాజంపేట టౌన్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న నాయకులు


సిద్దవటం: అమరజీవి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అడిషనల్ కమాండెంటు ప్రభుకుమార్


రైల్వేకోడూరు: పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దవటం : అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం చేసినటువంటి త్యాగాలు చిరస్మరణీయమని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్ అన్నారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కమాండెంటు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కమాండెంటు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి.కేశవరెడ్డి, వి.జయప్రసాద్, కె.వెంకటరెడ్డి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం

రాజంపేట టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వెలకట్టలేనిదని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జౌళిబజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నవీన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదూరి లక్ష్మినారాయణ, రాజా శరత్, రాజేష్, నటకల రామకృష్ణ, యశ్వంత్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని టోల్‌గేటు వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి యువకుడికి అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయమన్నారు. లక్ష్యం సాధించాలంటే ఆయన మార్గం ఎంతో ఉత్తమం అని తెలిపారు. ఆయన ధైర్యం, సంకల్పం, తెగింపుతోనే ప్రస్తుతం మనం ప్రతిఫలాలు అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ తోట శివసాయి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, గునిశెట్టి రమేష్, మేడా వెంకటసుబ్బయ్య, అబ్దుల్ రౌఫ్, బండారు మల్లికార్జున పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడు

రాయచోటి టౌన్ : నేటి తరం యువతకు పొట్టి శ్రీరాములు ఆదర్శపాయుడని రాయచోటి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాయులు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధ్భంగా డైట్ స్కూల్ సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాషా ప్రతిపాదికన రాష్ట్రాలు ఉండాలని ఆంధ్ర రాష్ట్రం అవతరణ కోసం ఆత్మ త్యాగం చేశారని తెలిపారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసి అసువులు బాసి అమరజీవి అయ్యారన్నారు. అలాంటి మహనీయుడిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి సత్యనారాయణ, కూన కృష్ణదేవరాయులు, రమేష్ బాబు, విజయ్ కుమార్, జవహర్, సుబ్రహ్మణ్యం, సుధాకర్, నవీన్ సుమన్, రంగనాథలు పాల్గొన్నారు.